సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు



శ్లాబ్‌పై పనులను పరిశీలిస్తున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ భవనం మరమ్మతులను శుక్రవారం ప్రారంభించారు. ఆ పనులను సీఐ కామేశ్వరరావు పరిశీలించారు. వర్షాలు పడితే చాలు, ఈ భవనం కారిపోతోంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లోని ఫైళ్లు తడిసిపోతుండడంతో సీఐ స్పందించారు. పరిస్థితిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి వివరించడంతో, ఆయన పోలీస్ సంక్షేమ నిధి నుంచి నిధులు విడుదల చేయించారు. వాటితో మరమ్మతు పనులు చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ సీజీఎంకు ఇంటక్ సత్కారం



ఉక్కు హెచ్‌ఆర్ సీజీఎం గాంధీని సత్కరిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.గాంధీని స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు సత్కరించారు. ఈ నెలాఖరున గాంధీ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందించారు. నాయకులు మాట్లాడుతూ గాంధీ అంచెలంచెలుగా సీజీఎం స్థాయికి చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు పి.వి.రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, ఎస్.ఎ.నాయుడు, మింది దేవుడు, ఉరుకూటి వెంకటరావు, కారు రమణ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి కార్మికునికి గ్రాట్యుటీ చెల్లింపు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కనీస వేతనాలకు నోచుకోక 29 సంవత్సరాలు వెట్టిచాకిరీకి గురైన శరగడం రామారావుకు కేంద్ర ట్రిబ్యునల్ ఆదేశాలతో ఎట్టకేలకు ఉక్కు యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించింది. ఈ మేరకు అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వెట్టి కార్మికుడు రామారావు మాట్లాడారు. 29 ఏళ్ల సర్వీస్‌లో నెలకు రూ.49 నుంచి రూ.189 రోజువారీ వేతనం పొందానని, సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు యాజమాన్యంతో పోరాటం చేయడంతో కనీస వేతనం చెల్లించిందన్నారు. 2019లో తనను విధుల నుంచి యాజమాన్యం తొలగించిందన్నారు. తరువాత గ్రాట్యుటీ చెల్లించాలని యాజమాన్యాన్ని కోరామని, నిరాకరించడంతో రామ అప్పారావు కేంద్ర ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడంతో యాజమాన్యం దిగి వచ్చి చెల్లింపులు చేసిందన్నారు. రామ అప్పారావు మాట్లాడుతూ బాధితునికి ఇప్పటికి న్యాయం జరిగిందని భావిస్తున్నానన్నారు.

రేపు తొట్లకొండపై యోగాంధ్ర

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తొట్లకొండలో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంలో ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్య యోగాసనాలు వేయనున్నారు. కార్యక్రమంలో ఇండియన్ నేవీ, స్వయం సహాయక బృందాల సభ్యులు, వివిధ యోగా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు సహా సుమారు వెయ్యి మంది పాల్గొంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి నేతృత్వంలో యోగాంధ్ర వేడుకలు నిర్వహించాలని, మిగిలిన శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గాజువాక : రోడ్డు పక్కన మృతి చెంది ఉన్న ఒక అనాథ మృతదేహానికి మానవతా సంస్థ ప్రతినిధులు దహన సంస్కారాలు నిర్వహించారు. స్థానిక ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతంలో రోడ్డు పక్కన చీకటి లక్ష్మణ్ అనే వ్యక్తి మృతి చెంది ఉన్నట్టు స్థానికుల ద్వారా తెలుసుకున్న మానవతా సంస్థ అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు తమ సంస్థకు చెందిన శాంతి రథంలో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి, దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నీలాపి అచ్చిబాబు, శరగడం రవికుమార్, దోబ జానకిరావు, చలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ బీ- బ్లాక్ నుంచి చుక్కవానిపాలెం వైపు వెళ్లే మార్గంలో అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు, దుమ్ము రేగుతున్న రోడ్డు

బాబోయ్ ఆటోనగర్ రోడ్లు

- దుమ్ము, ధూళితో అవస్థలు
- గతుకుల రహదారులపై ప్రయాణం నరకం
- శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు సతమతం
- పట్టించుకోని అధికారులు



బ్లాక్‌లో ప్రమాదకరంగా రోడ్డుపై గొయ్యి



ఆటోనగర్ ప్రవేశ ద్వారం ఆర్చ్ వద్ద రోడ్డు మధ్యలో గొయ్యి

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో రోడ్ల దుస్థితి వాహన చోదకులకు, కార్మికులకు నరకప్రాయంగా మారింది. సంవత్సరాలుగా కొత్త రోడ్లు లేక, కేవలం ప్యాచ్‌వర్క్‌లతో నెట్టుకొస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక ప్రాంతాల్లో రోడ్లు మరింత దుర్భరంగా మారాయని, కొత్త పరిశ్రమలు రాక పోగా, ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు.

శ్వాసకోశ సమస్యలు, ప్రమాదాలు

ఒకప్పుడు విశాఖ గాజువాక ఆటోనగర్‌లోని ఏ, బీ, డీ, డీ ఎక్స్‌టెన్షన్ బ్లాక్‌లలో ఐలా రోడ్లను అభివృద్ధి చేయడంతో పారిశ్రామికవేత్తలు ఎంతో సంతోషించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేవి. కానీ ప్రస్తుతం ఏ, బీ, డీ బ్లాక్‌లలో రోడ్లు ప్రమాదకరమైన గోతులతో నిండిపోయి, వాహనాల రాకపోకల సమయంలో విపరీతంగా దుమ్ము రేపుతున్నాయి. దీనివల్ల చాలా మంది వాహనదారులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు.

భారీ వాహనాలకు ఇబ్బందులు

నిత్యం వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భారీ వాహనాలు ఆటోనగర్‌లోని పరిశ్రమలకు వస్తూ ఉంటాయి. రోడ్డుపై ఉన్న గోతులతో ఈ వాహనాలు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేసి, కొత్త రోడ్లను నిర్మించాలని స్థానికులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పరిశ్రమల ఆశలపై నీళ్లు కుమ్మరించిన అండర్ గ్రౌండ్ కేబుల్స్ నిర్మాణం

విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో రోడ్ల నిర్మాణం ఒక సమస్యగా మారింది. తాజాగా అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు పారిశ్రామికవేత్తల ఆశలపై నీళ్లు చల్లింది. బహిరంగంగా ఉండే పవర్ కేబుల్స్ స్థానంలో అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినప్పటికీ, దీనివల్ల కొత్తగా నిర్మించిన రోడ్లు ధ్వంసమయ్యాయని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

కాంట్రాక్టర్లకు కలిసొచ్చే పనులు

ఆటోనగర్‌లో రోడ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు లాభసాటిగా మారిందని పారిశ్రామికవేత్తలు ఆరోపిస్తున్నారు. రోడ్లు వేయడం, ఆ తర్వాత పలు కారణాలతో వాటిని తిరిగి తవ్వేయడం, తవ్వేసిన రోడ్ల గోతులు, కోతలకు గురవడంతో తిరిగి కొత్త రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలవడం పరిపాటిగా మారిందని వారు చెబుతున్నారు.

నిర్మాణ పనులు ఎప్పటికి?

గత శీతాకాలం నుండే కొత్త రోడ్ల నిర్మాణంపై ఐలా ప్రతినిధులు, కమిషనర్ ప్రకటనలు చేశారని, టెండర్లను పిలిచి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారని పారిశ్రామికవేత్తలు గుర్తు చేస్తున్నారు. వేసవిలో పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉండగా, వేసవి ముగిసి వర్షాకాలం తిరిగి వచ్చిందని, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ రోడ్ల దుస్థితి వల్ల రవాణా, పరిశ్రమల కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

ఏటా రోడ్ల మరమ్మతులు

ప్రతి ఏటా వర్షాకాలంలో కురిసే వర్షాలకు కొత్త రోడ్లు కూడా చిన్న గోతులతో, గులకరాళ్లతో నిండిపోవడం, తిరిగి వాటికి కాంట్రాక్ట్ పద్ధతిలో కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టడం షరా మామూలే అని స్థానికులు విమర్శిస్తున్నారు.



ఏ బ్లాక్ రాంనగర్ ప్రవేశమార్గంలో ఆర్చ్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా గొయ్యి



ఆటోనగర్ డీ - బ్లాక్ నుంచి చుక్కవానిపాలెం వెళ్లే వైపు మలుపు వద్ద ఇలా..



బీ- బ్లాక్ నుంచి డీ - బ్లాక్ రోడ్డు మలుపు వద్ద రహదారి దుస్థితి

ఆటోనగర్ నుంచి ప్రయాణం ఇబ్బందికరమే..



నిత్యం ఏదో పనిమీద ఆటోనగర్ వెళ్లాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనంపై ఆటోనగర్ రోడ్లపై ప్రయాణించాలంటే గోతుల్లో సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. తరచూ ఆ మార్గంలో ప్రయాణిస్తుండటంతో నా బైక్ గోతుల్లో పడి మరమ్మతులకు గురైంది. ఆటోనగర్ అధికారులు స్పందించి కొత్త రోడ్లను త్వరగా ఏర్పాటు చేయాలి.

–వసంత్ కుమార్, ప్రైవేట్ ఉద్యోగి, హరిజనజగ్గయ్యపాలెం

దుమ్ముతో నిండిన ప్రయాణం



నేను ప్రతిరోజూ సైకిల్‌పై ఆటోనగర్ గుండా ప్రయాణిస్తా. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డుపై ఉన్న గోతులు, మట్టి వల్ల విపరీతమైన దుమ్ము గాలిలో ఎగిరి వెనుక వచ్చే వారిపై పడుతోంది. దీంతో దుస్తులు పూర్తిగా దుమ్ముతో నిండిపోతున్నాయి, శరీరంపై దుమ్ము పడి చిరాగ్గా ఉంటోంది. శ్వాసకోశ సంబంధిత సమస్యలకు దారితీస్తుందేమోనని భయంగా ఉంది. అధికారులు తక్షణమే కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–సింహాచలం, ప్రైవేట్ వర్కర్, ఆటోనగర్

సోలార్ పవర్ ఏర్పాటుపై అవగాహన



సోలార్ పవర్ ఉపయోగాలను వివరిస్తున్న ఏఈ రామకృష్ణ

గాజువాక : ఇళ్ల రూఫ్‌టాప్‌లపై సోలార్ పవర్ ఏర్పాటుపై ఏపీఈపీడీసీఎల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చినగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్ రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఈ రామకృష్ణ మాట్లాడారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోదలచిన వారికి ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అనంతరం తమ ఇళ్లపై సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోవడం కోసం 18 మంది దరఖాస్తు చేసినట్లు ఏఈ తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిచారా.. అంతే ..!



బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో శిథిలమైన కల్వర్టు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి శివాలయం రహదారి నుంచి విశాఖ డెయిరీ పార్లర్ టీ జంక్షన్ వద్ద శిథిలమైన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. పెదమడక శివాలయం రహదారి నుంచి సెక్టార్–1 కాలనీలు, ఆర్‌ఈసీఎస్ సెక్షన్ కార్యాలయం, పైడిమాంబ గుడి, బీసీ కాలనీ, చట్టివానిపాలెం వెళ్లే మార్గం ఆరంభంలో కల్వర్టు సగం వరకు శిథిలమైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతుండడంతో స్థానికులు ఆ మార్గం వైపు వెళ్లకుండా గుర్తించేలా క్లాత్‌ను, పలకలు, రాళ్లను గోతుల వద్ద ఏర్పాటు చేశారు. వీటిని గమనించకుండా రాత్రి వేళల్లో ఎవరైనా అటుగా వెళ్తే ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రహదారి గోతులను పూడ్చిన అధికారులకు శిథిల కల్వర్టు కానరాలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిరంకుశ నిర్బంధాలపై ఐక్య పోరాటం చేయాలి

- స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్
- ఘనంగా సిటు 55వ ఆవిర్భావ దినోత్సవం

ఉక్కునగరం: ప్రభుత్వాలు, యాజమాన్యాలు అనుసరిస్తున్న నిరంకుశ నిర్బంధాలపై ఐక్య పోరాటాలు చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమస్యలకు పరిష్కారం ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయడమే అన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు ఏర్పడింది సీఐటీయూ వల్లనే అన్నారు. వై.టి.దాస్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కె.గంగాధర్, టి.వి.కె.రాజు, వి.ప్రసాద్, గౌరిశంకర్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భెల్‌లో సీఐటీయూ పతాకావిష్కరణ చేస్తున్న జి.చిన్నబాబు

అక్కిరెడ్డిపాలెం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని భెల్‌లో నిర్వహించారు. సిటు నాయకుడు ఎస్.జగన్నాథరావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకు డు జి.చిన్నబాబు పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ బీహెచ్‌పీవీని భెల్‌లో విలీనం చేయడంలో సిటు పాత్ర ముఖ్యమైందన్నారు. గాజువాక జోన్ కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ ఐక్య పోరాటంలో సిటు ముందుండి పోరాడుతోందన్నారు. నాయకులు సీతన్నాయుడు, కోటేశ్వరరావు, నారపురెడ్డి, వెంకటేశ్వర్లు, మురళీశ్వరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి

పాత గాజువాక జంక్షన్‌లో..

గాజువాక : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్యత కోసం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను నిర్వహించడంలో సీఐటీయూ కృషి అజరామరమన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, మంగ, అరుణ, అప్పలనర్సమ్మ, మన్మథరావు, నాగేశ్వరరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకం.. వేసవి శిబిరం



కార్టూన్ పోటీల విజేతకు పుస్తకం అందజేస్తున్న రచయిత వెంకటరమణ



వేసవి శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ (వీసీసీ), రోటరీ యూత్ లీడర్‌షిప్ అవార్డ్స్ (రైలా) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన వేసవి శిబిరం విజ్ఞానదాయకంగా సాగుతోంది. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థులను వారి ఆసక్తికి అనుగుణంగా జట్లుగా ఏర్పాటు చేశారు. వివిధ సామాజిక అంశాలపై స్కిట్లు చేయించారు. చైల్డ్ రైట్స్ యాక్టివిస్ట్, కార్టునిస్టు, రచయిత హరి వెంకటరమణ విద్యార్థులకు కార్టూన్ వేయడం, కథ రాయడంపై అవగాహన కల్పించారు. కథ గురించి వివరించి, కథ రాయడం, చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా పిల్లలకు బొమ్మలు, కార్టూన్ల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పరశురాం పిల్లల వ్యక్తిగతమైన క్రమశిక్షణ గురించి వివరించారు. సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్న కార్యక్రమంలో వీసీసీ జిల్లా కన్వీనర్ కె.సుశీల, నాయకులు కె.రమాప్రభ, డి.శైలజ, జాహ్నవి, కల్యాణి, సరోజిని, గుణ శంకర్, శశికుమార్, వర్షిణి పాల్గొన్నారు.

దువ్వాడ.. ఆదాయంలో పైపైకి.!

- ఆదాయం, ప్రయాణికుల్లో అనూహ్య వృద్ధి
- తూర్పు కోస్తా రైల్వేలో ఆదాయ వృద్ధిలో నంబర్ వన్
- 2024-25లో దువ్వాడ రైల్వేస్టేషన్ దూకుడు



దువ్వాడ రైల్వేస్టేషన్

ఇదీ ప్రగతి

సంవత్సరం	ఆదాయం	ప్రయాణికుల సంఖ్య	స్థానం
2023-24	రూ.27,19,30,203	9,85,622	13
2024-25	రూ. 37,53,27,161	12,46,755	10

అగనంపూడి: ఆదాయం, ప్రయాణికుల సంఖ్యలో దువ్వాడ రైల్వేస్టేషన్ అనూహ్యమైన వృద్ధిని కనబరిచింది. గత రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తూర్పు కోస్తా రైల్వేలోని ప్రధాన స్టేషన్లలో 13వ స్థానంలో ఉన్న దువ్వాడ.. 2024-25 నాటికి మూడు స్థానాలు ఎగబాకి 10వ స్థానానికి చేరుకుంది. రైల్వే అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన వివరాల ప్రకారం ఈ గణాంకాలు వెల్లడయ్యాయి. తూర్పు కోస్తా రైల్వే జోన్‌లోని ముఖ్యమైన 15 రైల్వే స్టేషన్ల ఆదాయం, ప్రయాణికుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే దువ్వాడ పదో స్థానంలో నిలవడం విశేషం. 2023-24లో దువ్వాడ రైల్వేస్టేషన్ రూ.27,19,30,203 ఆదాయాన్ని ఆర్జించగా, 9,85,622 మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణించారు. ఫలితంగా ఆ ఏడాది స్టేషన్ 13వ స్థానంలో నిలిచింది.అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దువ్వాడ రైల్వేస్టేషన్ తన ఆదాయాన్ని రూ. 37,53,27,161కి పెంచుకుంది. ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగి 12,46,755కు చేరుకుంది. ఈ అద్భుతమైన పనితీరుతో దువ్వాడ రైల్వేస్టేషన్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 10వ స్థానంలో నిలిచింది. పలాస, రాయగడ, శ్రీకాకుళం వంటి స్టేషన్లను వెనక్కి నెట్టి ఈ ఘనత సాధించింది. మరోవైపు తూర్పు కోస్తా రైల్వేలోని 15 రైల్వేస్టేషన్ల ఆదాయ వృద్ధి శాతాన్ని పరిశీలిస్తే దువ్వాడ మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. ఈ విశేషమైన ప్రగతి ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించేలా చేసింది. దీనిపై దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

జిల్లా స్థాయి ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ క్రీడాకారులతో తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాల శ్రీనివాసరావు

పెదగంట్యాడ: కబడ్డీ క్రీడాకారులకు పెట్టింది పేరు గంగవరం అని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు అన్నారు. జీబీఎస్ స్పోర్ట్స్ యూత్ 28వ వార్షికోత్సవం సందర్భంగా గంగవరం గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ప్రో కబడ్డీ పోటీలను గురువారం రాత్రి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత పెద్దమ్మోరు ఆలయం నుంచి క్రీడాకారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవన్‌రెడ్డి మాట్లాడుతూ గంగవరం గ్రామంలో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి తమ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. ఈ పోటీలకు ధర్మాల శ్రీనివాసరావు రూ. 1లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో 8 జట్లు తలపడనున్నాయని, విజేతలకు వచ్చే నెల 1న బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కబడ్డీ సెక్రటరీ జేఎస్‌పీ ప్రసాద్‌రెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షుడు కృష్ణ , క్రీడాకారులు వైవీ శ్రీను, కోలా దుర్గారావు, పైడిరాజు, కొవిరి అవతారం, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన



జలమయమైన బీసీ రోడ్డు

పెదగంట్యాడ: మండలంలో శుక్రవారం సాయంత్రం వర్షం కుమ్మేసింది.. ఏకధాటిగా గంట పాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు భగభగలాడటంతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నిండా కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఆపై మెల్లగా మొదలైన వర్షం దంచి కొట్టింది. దీంతో కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



కురుస్తున్న వర్షం





WANTED TEACHERS

The Legend World School

B.C. Road, Gajuwaka, VSP. Ph: 7382304105

PRINCIPAL & VICE PRINCIPAL

Qualification : Post Graduate / Graduate with B.Ed.

TEACHERS FOR PRIMARY & HIGH SCHOOL (ALL SUBJECTS)

Qualification : Graduate with B.Ed., & D.Ed.,

P.E.T./ DRAWING/ COMPUTER/ DTP OPERATOR

with good communication skills are required

Walk-in-interview :
Sunday, Monday & Tuesday - June 1st, 2nd & 3rd
Timings: 9.00 A.M. to 4.00 P.M.